# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **సమున్నతమైన భారత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.**

**2.** **పౌరులందరూ ఎల్లప్పుడూ ఓటు హక్కును గరిష్ట సంఖ్యలో వినియోగించుకుంటూ.. దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం కావాలని ప్రధానమంత్రి సూచించారు.**

**3.** **కృష్ణా జిల్లా కొండపావులూరులో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రాంగణాన్ని, ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ భవనాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కొద్దిసేపటి క్రితం ప్రారంభించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు దావోస్ పర్యటనకు వెళ్తున్నారు.**

**5.** **గిరిజనులు, ఆదివాసీల ఉత్పత్తులకు డిమాండ్ ఉందని, వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాపార రంగంలో రాణించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు.**

===========================

సమున్నతమైన భారత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 118వ సంచికలో ఆయన ఈరోజు మాట్లాడారు. మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వంటి ప్రముఖులు మనకు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల గురించి తెలియజేశారని, వాటిని మనం కాపాడుకుంటూ గొప్ప భారత దేశ నిర్మాణానికి కృషి చేయాలని నరేంద్రమోదీ సూచించారు. ఈ నెల 26వ తేదీన మనం నిర్వహించుకోబోయే భారత గణతంత్ర 75వ వార్షికోత్సవం చాలా ప్రత్యేకమైందని ఆయన అన్నారు. ఈ ఏడాదితో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలవుతోందని ప్రధాన మంత్రి పేర్కొంటూ..

..వాయిస్.. 21 సెకన్లు

-------------------------

భారత దేశ పటిష్టమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 25వ తేదీ మనకు ఎంతో ముఖ్యమైన రోజు అని అన్నారు. ఆ రోజు భారత ఎన్నికల సంఘం ఏర్పడిందని ప్రధానమంత్రి తెలిపారు. మన రాజ్యాంగ నిర్మాతలు ఎన్నికల సంఘానికి, ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యానికి రాజ్యాంగంలో ముఖ్యమైన స్థానాన్ని ఇచ్చారని.. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ పౌరులందరూ ఎల్లప్పుడూ తమ ఓటు హక్కును గరిష్ట సంఖ్యలో వినియోగించుకుంటూ.. దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం కావాలని, ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నరేంద్రమోదీ సూచిస్తూ..

.. వాయిస్…39 సెకన్లు

---

భారత దేశ అంతరిక్ష రంగాన్ని మన అంతరిక్ష శాస్త్రవేత్తలు స్వాలంవన దిశగా తీర్చిదిద్దుతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ.. మన శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఉపగ్రహాలను అనుసంధానం చేసే రంగంలో మరొక అద్భుత విజయం సాధించారని అన్నారు. అంతరిక్ష కేంద్రాలకు, అంతరిక్షంలోని సిబ్బంది బృందాలకు సామగ్రిని పంపడానికి ఈ సాంకేతిక విజయం ఎంతో కీలక మైందని నరేంద్రమోదీ తెలిపారు. ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన మన దేశ మహోన్నత నాయకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఈ నెల 23వ తేదీని “పరాక్రమ దివస్” గా జరుపుకొంటున్నామని ప్రధాన మంత్రి గుర్తు చేస్తూ..

…వాయిస్. 33 సెకన్లు

---

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రపంచ దేశాల ప్రజలు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని ప్రధానమంత్రి వెల్లడించారు. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను ఆయన అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడతాయని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని ప్రధానమంత్రి తెలిపారు.

---

కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఈ రోజు 20వ జాతీయ విపత్తు నిర్వహణ దళం.. ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ..ఎన్ఐడీఎం ప్రాంగణాన్ని అమిత్‌షా ప్రారంభించారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ భవనాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది నిర్వహించిన మాక్ డ్రిల్‌ను అతిథులు వీక్షించారు. ఆ తర్వాత ఎన్డీఆర్ఎఫ్ పరికరాల గ్యాలరీని అమిత్ షా సహా అతిథులు పరిశీలించారు.

---------------------------

తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో 3 కోట్ల 60 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీని కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా వర్చువల్ విధానంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మణికంఠ పాత్రికేయులతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన ఆర్.ఎఫ్.ఎస్.ఎల్.భవనంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలను నియంత్రించవచ్చని చెప్పారు. డిఎన్ఏ గుర్తింపు, పోక్సో, హత్య కేసుల్లో ఆధారాల సేకరణ, గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన వివరాల సేకరణ సులభతరమవుతుందని ఎస్పీ వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సాయం, రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ నేతలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిశా నిర్దేశం చేశారు. విజయవాడ ఈ రోజు ఉదయం ఆయన పార్టీ నేతలతో సమావేశమయ్యారు. కీలక అంశాలపై వారికి అమిత్‌షా అనేక సూచనలు చేశారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. 'హైందవ శంఖారావం' సభ విజయం పట్ల పార్టీ, విశ్వ హిందూ పరిషత్ నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నేతలు ముందుకెళ్లాలని అమిత్‌షా సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. సాయంకాలం ఢిల్లీ చేరుకుని, అర్ధరాత్రి దాటాక ఒంటి గంటన్నర సమయంలో ప్రతినిధుల బృందంతో కలిసి జ్యూరిచ్ బయల్దేరతారు. అక్కడి భారత రాయబారితో సమావేశమవుతారు. రోజుకు కనీసం పదికి పైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు నాయుడు పాల్గొని.. రాష్ట్రంలో మానవవనరులు, మౌలిక సౌకర్యాలు, ప్రభుత్వ రాయితీలు, సమర్థ నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై వివరిస్తారు. నాలుగోరోజు ఉదయం స్వదేశానికి బయల్దేరతారు.

---------------------------

గిరిజనులు, ఆదివాసీల ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ ఉందని, వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాపార రంగంలో రాణించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈరోజు ఏర్పాటు చేసిన గిరిజన-ఆదివాసి సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో ఆదివాసులు తమదైన ప్రత్యేక హస్తకళా నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని తెలిపారు.

=====================